# ఆయన కోరిక

ఆయన వయసు ఎనభై సంవత్సరాలు ఆ ఇంట్లో ఆయన స్థానం.. వరండాలో.. ఓ మూల వేసిన ఈజిఛైర్..

అది ఆయన కొడుకు ఇల్లు.. కొడుకూ, కోడలూ.. ఐదేళ్ళ మనవరాలూ.. పన్నేండేళ్ళ మనువడు.

భార్య చనిపోయి నాలుగేళ్ళవుతోంది.

పెద్ద కొడుకు అమెరికాలో వున్నాడు కుటుంబంతో

భారతదేశం అంటే ఆయనలో వున్న మమకారానికి గుర్తుగా.. ఆయన చిన్న కొడుకు ఆశ్రయంలో వుండిపోయాడు. ఆయన ముందు ఓ పోర్టబుల్ టి.వి. వుంది.

అప్పుడు సమయం... ఉదయం ఆరున్నర...

ఆరోజు.. ఆయన కెంతో ప్రియమైన రోజు...

ఆగస్ట్ 15... స్వాతంత్ర్య దినం...

భారతదేశం, విదేశీ హస్తాల ఉక్కుబంధాల నుంచి విముక్తి పొంది, స్వేచ్ఛావాయువులు పీల్చడం ప్రారంభించి యాభై ఏళ్ళు పూర్తయింది.

ఎనభై ఏళ్ళ ఆయన మనసూ, శరీరం ఆ ఆలోచనతో పులకరించి పోయింది.

చిన్నప్పుడే... తల్లిదండ్రుల్ని.. వాళ్ళ అనురాగాన్ని... వదలుకుని రాజకీయాల్లో ప్రవేశించాడు అనంతరామయ్య...

గాంధీగారి ఉపన్యాసాలకు.. ప్రకాశం గారి ఆత్మస్థైర్యానికి ప్రభావితుడై స్వాతంత్ర పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాడు.

ఉప్పు సత్యాగ్రహంలో.. విదేశీ వస్త్ర దహనంలో ప్రముఖ పాత్ర వహించడమే కాదు.. ఆనాటి నుంచి ఈనాటి దాకా ఖద్దరు వస్త్రాలే ధరిస్తూ వచ్చిన.. నిజమైన దేశభక్తుడు..

''క్విట్ ఇండియా'' ఉద్యమంలో జైలుకెళ్ళి ఎన్ని చిత్రహింసలు భరించినా తొణక్కుండా స్వాతంత్ర్యం కోసం చివరి దాకా పోరాడాడు.. స్వాతంత్ర్యం వచ్చిందాకా పెళ్ళి చేసుకోనని భీష్మ ప్రతిజ్ఞ చేసి, 1947 ఆగస్ట్ 16 తారీఖు ఉదయం ఓ బాలవితంతువు మెడలో పూలహారం వేసి తన జీవితంలోకి నడిపించుకు తీసుకువచ్చాడు.

నలుగురు పిల్లలకి జన్మనిచ్చి.. నలభై ఐదేళ్ళు ఆ మహానీయుడితో కాపురం చేసి... సెలవు పుచ్చుకుందా సహధర్మచారిణి.

చిన్నా, పెద్దా ఉద్యోగాలు చేస్తూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో వస్తోన్న అనేక రకాల మార్పుల్ని... అభివృద్ధిని మౌనంగా వీక్షిస్తూ.. మంచికి పరవశిస్తూ.. చెడుకి పరితపిస్తూ తనలోనే తన అనుభూతుల్ని దాచుకున్న ఓ మౌనముని అనంతరామయ్య.. నిజమైన స్వాతంత్ర్య సమరయోధులెవరూ.. ఈనాడు ప్రభుత్వం అందిస్తోన్న అనేక రకాల అవకాశాలను ఉపయోగించుకోడంలేదన్న దానికి అనంతరామయ్య ప్రత్యక్షసాక్షి, నిజానికి ఆయన ఎప్పుడూ ఏదో ఆశించి.. ఏమీ చేయలేదు.. స్వాతంత్ర్యం వచ్చిన మరుక్షణం నుంచే ఆయన అజ్ఞాతవాసంలోకెళ్ళిపోయాడు.

ఉడతా భక్తిగా.. స్వాతంత్ర్య సముపార్జన కోసం, ఓ వీరుడిగా తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చానన్న తృప్తి తప్ప ఆయనకేమీ దక్కలేదు.. అయినా ఆయనెప్పుడూ దక్కని వాటి కోసం బాధపడలేదు.

విధవా వివాహం చేసుకుని.. ఓ స్త్రీని ఉద్ధరించానన్న గర్వం ఆయన ఏనాడూ తనలో కలగనివ్వలేదు.. తను చేసిన ఓ గొప్ప పనికీ.. ప్రచారం జరగనివ్వలేదు.. ఆయన దేశభక్తుడు.. ఆయన సంఘ సంస్కర్త.. ఆయనో ఆదర్శవాది.. అభ్యుదయవాది.. అయినా ఎవరికీ తెలీదు ఆయన గొప్పతనం. తెలిసిన కొందరు మిత్రులు కాలగర్భంలో కలిసిపోయారు. ఆయన ఇప్పుడు వయసు ఉడిగిన ఓ వృద్ధుడు.. ప్రభుత్వ ఉద్యోగం చేయలేదు.. అందుకే పెన్షన్

లేదు.. స్వాతంత్ర్య సమరయోధులందుకుంటున్న పెన్షన్‌గానీ రైల్వేపాస్‌గాని, మెడికల్ ఫెసిలిటీస్ గానీ... ఏది ఆయనకి తెలీదు. వాటి కోసం వెంపర్లాడలేదు.. ఇలాంటీవన్నీ కల్పించడానికి బ్రోకర్లున్నారని ఆయన తెలుసు.. ఆ బ్రోకర్ల ద్వారా.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పుట్టినవాళ్ళు కూడా.. అలాంటి అవకాశాల్ని వినియోగించుకుంటున్నారనీ ఆయనకి తెలుసు.. అయినా ఆయన చలించలేదు.. నిజానికి తండ్రి విధవా వివాహం చేసుకున్నాడన్న సంగతి ఆయన పిల్లల్లో కూడా ఎవరి తెలీదు. ఎనభై ఏళ్ళ ఆ జీవితంలో ఆయన పెద్దగా ఆశించిందేంలేదు. పూలదండా.. సత్కారాలూ.. సన్మానాలు.. ఇంటర్వ్యూలు.. అవేవీ ఆయనకి తెలీవు.. ఆ కోరికలు కూడా లేవు.. ఆయన కున్నది ఒకే ఒక్క కోరిక.

మూడు రంగుల.. జాతీయ జెండా ఒక్కసారి తన చేతుల మీదుగా ఎగరవేయాలి..

ఎన్నో త్యాగాలు చేసి, ఎంతో శ్రమించి.. పోరాడి.. లాఠీ దెబ్బలు తిని.. జైల్లో మగ్గి.. రాత్రి పగలూ నిద్రాహారాలు మాని.. నిర్విరామకృషితో సాధించిన స్వేచ్ఛకి చిహ్నంగా.. గర్వంగా మువ్వన్నెల జెండా ఒక్కసారన్నా ఎగరేయాలి.. అందులోంచి రాలి పడే ఆ గులాబీ రేకుల వర్షంలో తడవాలి.. అంతే.. అంతే అది చాలు.. ఆ పులకరింతల మధ్య ఈ తనువు.. ధన్యమై.. రాలిపోతే చాలు.. అదే ఆయన కోరిక.. ఆయన కళ్ళు టివి స్క్రీన్ మీద కదుల్తోన్న బొమ్మల్ని చూస్తున్నాయి.

సైనికుల మార్చ్‌ఫాస్ట్..

భారత ప్రధాని చేతుల మీదుగా.. ఎగరవేయబడిన మువ్వన్నెల జెండా.. ఢిల్లీలోని ఎర్రకోట పైన ఠీవిగా.. సొగసుగా ఎగురుతోంది.

''ఢిల్లీ కోటపై త్రివర్ణ జెండా ఎగురుతున్నది చూడుమురా..''

''మావయ్యగారూ! కాఫీ...'' కోడలు సువంతి కాఫీ కప్పు అందించింది...

మౌనంగా అందుకున్నాడు.

ఆయన కళ్ళు టి.వి. స్క్రీన్ మీదే..

పద్మాకారంలో.. దేశపటం ఆకారంలో.. నిలబెట్టబడిని పాఠశాల విద్యార్థినీ.. విద్యార్థులు..

సైనికుల విన్యాసాలు.. ప్రధాన మంత్రి సందేశం.. బాల బాలికల ఆటా.. పాటలూ.. నాట్యాలూ..

అడుగడుగునా ఉరకలేస్తున్న ఉత్సాహం...

ఆనందం..

ఆగస్ట్. పదిహేను..

ఎంత పవిత్రమైనదీ రోజు..

భారతదేశంలో ప్రజలంతా కుల, మత, జాతి వర్గ భేదాలు మరచి.. కలిసి చేసుకునే పండగ.. ఇదే..

ఆయన శరీరంపైన రోమాలు నిక్కబొడుచుకున్నాయి..

కళ్ళు రెండు.. బాష్ప బిందువులతో నిండాయి..

కాలం మారిపోయింది.. పరమ పవిత్రమైన జలాలు కలుషితమయ్యాయి.. స్వచ్ఛమైన గాలిలో మాలిన్యం కలుస్తోంది.. మనుషుల మనసుల్లో.. ప్రవర్తనలో.. కృత్రిమత్వం.. వ్యాపార దృక్పథం పెరిగిపోతున్నాయి.

ఈ దేశంలో ఎందరో మేధావులున్నారు.. పండితులున్నారు.. కళాకారులున్నారు.. దేశభక్తులున్నారు.. స్వాతంత్ర్య సమరయోధులున్నారు.. నిజానికి అసలైన వాళ్ళకెవరికీ గుర్తింపు లేదు.. నిజమైన దేశభక్తుడు.. ఏ బిరుదు కోరుకుంటాడు!

కళలను గౌరవించే కళాకారుడు.. తన కళని అమ్ముకోగలడా! అసలైన పండితుడు తన విద్యను ఎక్కడ ప్రదర్శించగలడు! అందుకే వీళ్ళ కెవరికీ గుర్తింపులేదు.. ఉండదు కూడా.. గుర్తింపులేని వాళ్ళకి డబ్బుండదు.. డబ్బులేని వాడికి కీర్తి ఉండదు.. వాళ్ళల్లో ఉండేది నిజాయితీ.. నిర్మలత...

నిట్టూర్చాడు అనంతరామయ్య

స్క్రీన్ మీద దృశ్యాలు మారాయి. హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో

జరుగుతున్న స్వాతంత్ర్యోత్సవ సంబరాలు చూపిస్తున్నారు.

గవర్నర్‌గారు పతాకావిష్కరణ చేశారు.

సైనిక వందనం స్వీకరించారు.. ఆయన ఉపన్యాసం ఎంతో ఉత్తేజకరంగా ఉంది...

ఒంట్లో సత్తువ ఉన్నంతకాలం ఈ సంబరానికి అనంతరామయ్య హాజరవుతుండేవాడు.. ఆ ఉత్సాహంలో, ఆనందంలో పాలు పంచుకుంటూనే ఉండేవాడు..

అభ్యుదయం గురించి తెలీయకుండానే అభ్యుదయ పథంలో పయనించి... మొగ్గగానే జీవన సుమం చితికిపోతుందనుకున్న ఓ విధవరాలికి జీవితం యిచ్చిన మహనీయుడు.. నిజాయితీగా.. మనసా, వాచా కర్మణా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి.. ఈనాటి స్వాతంత్ర్య సంబరాలకి ఉడతభక్తి సహకారం అందించిన స్వాతంత్ర్య సమరయోధుడు అనంతరామయ్య... ఓ సాధారణ పౌరుడిలా.. జీవితచరమదశలో నిలబడి... ఆశగా.. తాను ఎగరవేయాలనుకున్న జెండా వైపు చూస్తున్నాడు.. ఎంత దురదృష్టవంతుడు తను!.. తనో ఎం. ఎల్. ఎ అయినా బాగుండేది. ఆ నియోజక వర్గంలో నైనా జెండా ఎగరేసే వాడు.

కనీసం.. కాలనీ ప్రెసిడెంట్ అయినా బాగుండేది.. ఆ కాలనీలో జెండా ఎగరేసేవాడు..

తనేమీ కాదు.. బ్రతకలేని బడిపంతులుగా కొన్నాళ్ళు.. ప్రూఫ్‌రీడర్‌గా కొన్నాళ్ళు... చాలీచాలని జీతంతో కుటుంబాన్ని లాక్కొచ్చిన ఓ మామూలు వ్యక్తి.

టి.వి. స్క్రీన్ మీద ఎన్నో... ఎన్నెన్నో పతాకాలు ఆవిష్కరింప బడుతున్నాయి...

ఎం. ఎల్. ఎ. లు.. లీడర్లు.. కలెక్టర్లు.. మంత్రులు.. వీళ్ళందరికీ గాంధీ అంటే గౌరవం ఉందా?...

వీళ్ళందరిలో భరతమాత పట్ల భక్తి ఉందా?...

వీళ్ళల్లో ఏ ఒక్కరన్నా నిజంగా స్వాతంత్ర్య పోరాటం జరిపారా!..

పదవులు.. చదువులు.. హోదాలు కల్పించిన అర్హతతో పవిత్రమైన జెండా ఎగరేస్తున్నారు..

ఓ పవిత్ర ఆశయంతో, మహానుభావుల నిర్విరామకృషితో, నిరంతర పోరాటంతో, అచంచల విశ్వాసంతో సంపాదించిన స్వాతంత్ర్యాన్ని దర్జాగా అనుభవిస్తున్న వీళ్ళందరికీ జెండా విలువ తెలుసా!

ఎన్నో ఏళ్ళుగా ఒక్కసారన్నా జెండా ఎగరేయాలన్న తన కోరిక తీరలేదు.. ఈ తనువు ఇంక రాలిపోతుంది.. కోరిక తీరకుండానే..

హు.. ఎలా తీరుతుంది?., తను మంత్రికాదు.. ఎం. ఎల్. ఎ. కాదు.. కలెక్టర్ కాదు.. తనెవరు?

శతకోటి లింగాల్లో బోడిలింగం.. మహాసముద్రంలో ఓ నీటి బొట్టు.. అనంతమైన ఇసుకరేణువుల్లో ఓ రేణువు..

ఒక్కసారి.. ఒక్కసారి.. జెండా ఎగరేయాలి.

పవిత్రమైన ఆ పతాకాన్ని ఒక్కసారి స్పృశించాలి.. ఒక్కసారి అటెన్షన్‌లో నిలబడి.. చేయెత్తివందనం చేయాలి.. అమ్మా! భరతమాతా! వంగిపోయిన ఈ నడుముకి ఒక్క క్షణం పటుత్వాన్ని ప్రసాదించు.. వణికే ఈ చేతులకు.. నమస్కరించే శక్తినివ్వు..

''తాతయ్యా!.. ఆయన చేతిపైన ఓ లేత గులాబీరాలిన అనుభూతి.. కళ్ళు తిప్పి చూశాడు.

నిర్మలమైన కళ్ళతో.. స్వచ్ఛమైన చిరునవ్వుతో ఐదేళ్ళ కరుణ..

''తాతయ్యా! నాతో రావూ! నేనూ, లతా, దివ్యా, అన్నయ్యా, రవీ. అందరం కలిసి జెండా వందనం చేస్తున్నాం.. మన పెరట్లో నువ్వొచ్చి జెండా ఎగరేయవూ.. తాతయ్యా! ప్లీజ్.. నీకు అమ్మ చూడకుండా జిలేబీ పెడతా.. నీకు స్వీట్ పెట్టద్దు అంటుందిగా అమ్మ..''

పలుకుల్లో జాలువారుతన్న తేనె.. చూపుల్లో అమాయకత్వం.. కళ్ళల్లో కోటి కాంతులు.. లేలేత స్పర్శ...

ఆయన వణికే చేతుల్ని పట్టుకుని జాగ్రత్తగా నడిపించుకెళ్లింది పెరట్లోకి.. అనవసరమైన ఆర్భాటాలకూ.. కృత్రిమమైన నటనకూ.. హంగులకూ..

అతీతంగా చిన్నారులు ఏర్పాటు చేసిన సంబరానికి.. మనవరాలి చేయి ఊతంగా అందుకుని.. జీవితంలో మరోసారి తప్పటడుగులు వేశాడాయన.

చిన్న, చిన్న, కాగితం జెండాలను తోరణాల్లాకట్టి, మామిడి చెట్టు మొదట్లో మట్టితో గట్టుకట్టి, దాని మధ్యలో కర్రపాతి.. దాని చివర ముడిపెట్టిన మువ్వన్నెల జెండా.. చిన్న స్టూలు మీద గాంధీతాత ఫోటో.. చిన్నారుల మనసుల్లా గుబాళిస్తున్న అగరొత్తుల పరిమళం.. అల్లిబిల్లిగా అల్లిన రకరకాల పూలమాల.. భరిణలో కుంకుమ.. పళ్ళెంలో మరమరాలు.. బెల్లం... చిన్న పొట్లంలో జిలేబి.. ఆయన గుండెల్లో పులకింతలు..

కళ్ళలో ఆనందభాష్పాలు..

చేతులు వణుకుతుంటే, మెల్లగా దారం లాగాడు.. జలజలా రాలాయి కన్నీళ్ళతో పాటు. గులాబీరేకులు..

ఈ సువర్ణ పుష్పాల కాంతి ప్రపంచమంతా వ్యాపించాలి.. మహాత్మా! ఈ కాంతుల్లో నూతన ప్రపంచానికి అంకురార్పణ జరగాలి... దీవించు తండ్రీ చిన్నారులను.. రక్తపాతంతో కలుషితమైన జీవనదులన్నీ ఈ చిన్నారుల పాదస్పర్శతో పునీతమై, దేశం పచ్చగా.. సౌభాగ్యవంతంగా వుండాలని దీవించు.. ఈ దేశాన్ని రక్షించు.. వందేమాతరం.. వందేమాతరం.. చిన్నారుల లేత స్వరాలతో మిళితమై.. పాడింది ఆయన స్వరం..

( అజ్ఞాతంలో ఉన్న, ఉంటున్న మా నాన్నగారిలాంటి అనేకమంది దేశభక్తులకి ఈచిన్ని సుమం అంకితం).

విశాలాంధ్ర
తేది 23-8-98